క్లుప్తంగా

ఘనంగా ఖాద్రియా ఉరుసు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో శుక్రవారం ఖాద్రియా ఉరుసు ఘనంగా నిర్వహించారు. దర్గాలోని ఖాద్రియా పీఠం వద్ద భక్తులు ప్రత్యేక ఫాతే హాలు చేయించారు. ఖాద్రియా పీఠాధిపతి సయ్యద్ గౌసే సమ్‌దానిఖాద్రి దర్గాలో ఫాతే హాలు, చక్కెర చదివింపులు చేయించారు. గురువారం గంధం కార్యక్రమం, శుక్రవారం ఉరుసుతో వేడుకలు ముగిశాయి. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, కణేకల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరిలు వేడుకల్లో పాల్గొన్నారు.

'మానసిక ఒత్తిడికి గురికావొద్దు'

కూడేరు: గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవమయ్యేవరకూ మానసిక ఒత్తిడికి గురికాకూడదని మండల వైద్యాధికారిణి సరిత సూచించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ సుఖ ప్రసవం జరగాలంటే పోషకారం తీసుకోవడంతోపాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రమేష్ రెడ్డి

కూడేరు: పశువులకు మెరుగైన వైద్య సేవలందించాలని పశుసంవర్థక శాఖ అనంతపురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన కూడేరులోని పశువైద్య శాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పశు వైద్యసేవలకు సంబంధించిన, సమీకృత దాణా పంపిణీకి సంబంధించి రిజిష్టర్లను పరిశీలించారు. పశుబీమాపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సబ్సిడీతో అందించే సమీకృత దాణా గురించి పాడి రైతులకు వివరించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్‌కు సన్మానం

బ్రహ్మసముద్రం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న సుకర్ణ గుమ్మఘట్ట మండలానికి బదిలీ అయ్యారు. శుక్రవారం తహసీల్దార్ బాలకిషన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఆయనను సన్మానించారు. అలాగే ఆయన స్థానంలో వైఎస్సార్ జిల్లా పులివెందుల నుంచి బదిలీపై వచ్చిన సందీప్‌రెడ్డిని రెవెన్యూ సిబ్బంది సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

జోడు మారెమ్మదేవి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో జోడు మారెమ్మదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిపురాతనమైన ఈ ఆలయాన్ని రూ.50 లక్షల వ్యయంతో జీర్ణోద్ధరణ చేసి సరిగ్గా 41 రోజుల క్రితం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన విషయం విదితమే. సంప్రదాయం ప్రకారం ఆలయంలో 41వ రోజు ప్రత్యేక పూజలు చేయించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, హర్షవర్ధన్, సురేంద్ర, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం



హజ్‌యాత్రకు వెళుతున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పవిత్ర హజ్‌యాత్ర(మక్కా, మదీన)కు రాయదుర్గం పట్టణం నుంచి ఐదుగురు ఈ నెల 22న బయలుదేరనున్నారు. యాత్రకు వెళుతున్న ఆత్మకూరు వీధికి చెందిన జాకీర్ నివాసంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫ్రెండ్స్ గ్రూపు సభ్యులతో పాటు సన్నిహితులు, సర్ ఖాజీ సైపుల్లా తదితరులు శుక్రవారం సత్కరించారు. ప్రభుత్వ ఖాజీ సైపుల్లా దువా పఠించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులు అబుబక్కర్, మహమ్మద్ రఫీక్, ఇనాయత్, కరీం, కబీర్, ఫైరోజ్, కేజీఎస్ ఫైరోజ్, అమ్మద్ హుస్సేన్, మొజ్జిన్ మహబూబ్‌సాబ్, హనీఫ్, అజ్మతుల్ ఇస్లాం కమిటీ కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ లబ్ధి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం 'లో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



నక్కలపల్లిలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని నక్కలపల్లిలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తుల సమస్యలకు సత్వర పరిష్కార మార్గాలను చూపడంతో పాటు గ్రామానికి బీటీ రోడ్డు, ఆర్‌టీసీ బస్సు సదుపాయం కల్పించడంపై గ్రామంలో విశేష స్పందన వచ్చింది. మాజీ ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు ఆమోదయోగ్యం లేని స్థలాలను రద్దు చేసి సుమారు 100 మందికి సర్వే నెంబర్ 116-2లో 4.30 ఎకరాల్లో తిరిగి పట్టాలను అందించేలా ఆర్‌డీఓ నిషాంత్‌రెడ్డి, తహసీల్దార్ పీరాకు సూచించామన్నారు. గ్రామస్తుల సౌకర్యార్థం రూ.1.78 కోట్ల నిధులతో బీటీ రహదారితో పాటు ఆర్టీసీ బస్సు రాకపోకలకు అధికారులతో మాట్లాడామన్నారు. గ్రామాభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన లబ్ధిదారులకు గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించేలా సచివాలయ వ్యవస్థతో దేశంలోనే ఆదర్శవంతమైన పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్నారన్నారు. మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందామని, ప్రజలందరూ అండగా ఉండాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, ఎంపీడీఓ రామచంద్ర, ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, సర్పంచ్ ఊరువాకిలి రామిరెడ్డి, ఎంపీటీసీ వరలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, వెంకటలక్ష్మి గ్రామ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు త్రిలోక్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, రవీంద్రారెడ్డి, గోవిందరెడ్డి, వినోద్‌రెడ్డి, కేశవరెడ్డి, జగన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరంగాపురంలో..

బెళుగుప్ప మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం ఉదయం 8.30 గంటలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

వైఎస్సార్ బీమా పంపిణీ

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని గొడిశెలపల్లిలో హరిజన రామప్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా రూ. లక్ష మంజూరైంది. శుక్రవారం వైఎస్సార్‌సీపీ సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రానాథ్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ గౌస్, వలంటీర్లు తక్షణ సహాయంగా రూ.10 వేల నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'శ్మశాన వాటికను పరిరక్షించండి'

రాయదుర్గం రూరల్: ఆక్రమణదారుల నుంచి శ్మశాన వాటికను పరిరక్షించాలని మండలంలోని ఆర్బీ వంక (బొందనకల్లు) గ్రామానికి చెందిన దళితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు డిప్యూటీ తహసీల్దార్ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ధనసింగ్‌నాయక్, మోహన్‌నాయక్ దౌర్జన్యంగా శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకున్నారు. గురువారం దళిత కులానికి చెందిన వ్యక్తి మృతి చెందగా శ్మశానంలో ఖననం చేశామన్నారు. పాతిపెట్టిన శవాన్ని బయటకు తీసి వేరే చోట పాతిపెట్టుకోవాలని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సామాజిక తనిఖీలో రూ.96,594 రికవరీ



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ

ఉరవకొండ రూరల్: మండలంలోని 17 గ్రామ పంచాయతీల వ్యాప్తంగా 2021-22లో ఉపాధి పథకం, సర్వశిక్షా అభియాన్, పంచాయతీ రాజ్ విభాగాల్లో జరిగిన పనులపై శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, డీవీఓ రమణారెడ్డి, అంబుడ్స్‌మెన్ మధుసూదన్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. సామాజిక తనిఖీలో మూడు విభాగాల్లో రూ.16,40,950 పనులు నిర్వహించగా. ఉపాధి హామీ సిబ్బంది సరైన వివరాలు చూపించలేదు. వీటిలో కొంత అవినీతి జరిగినట్లు తేలింది. ఉపాధి పనుల నుంచి రూ.56,139, పెనాల్టీలు ద్వారా రూ. 24,000, పంచాయతీరాజ్ పనుల నుంచి రూ. 16,455ను రికవరీ చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎస్ఆర్‌పీ లోకేష్, టెక్నికల్ అసిస్టెంట్ పోలేరయ్య, ఏపీఓ విమల తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో రోగాలు దూరం



దోమలు వృద్ధి చెందకుండా మలాథియన్ పిచికారీ చేయిస్తున్న జిల్లా సహాయ మలేరియాధికారి

కూడేరు: ముందస్తు నివారణ చర్యలు చేపడితే మలేరియా, డెంగీ తదితర వ్యాధులు కట్టడి చేయవచ్చని జిల్లా సహాయ మలేరియాధికారి సత్యనారాయణ సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో త్వరలో క్యాడెట్లకు శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. క్యాడెట్లు రోగాల బారినపడకుండా వైద్యాధికారులు ముందస్తు జాగ్రతలు చేపట్టారు.అందులో భాగంగా శుక్రవారం ఆయన మండల సిబ్బందితో కలిసి క్యాడెట్లు, అధికారులుండే గదులు, పరిసర ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకూడా మలాథియన్‌ను పిచికారీ చేయించారు. ప్రజలు కూడా దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సామాజిక ఆరోగ్య అధికారి మోహన్‌బాబు, మలేరియా జిల్లా సబ్ యూనిట్ ముద్దయ్య, సూపర్ వైజర్ మూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఆరోగ్య కార్యకర్తలు మురళి, రమేష్, ఏఎన్ఎం భాను, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లనగుడ్డంలో ఉచిత వైద్య శిబిరం



జ్వరంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో వైద్యాధికారి రఫియా సుల్తానా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో కొంతమంది రెండు రోజులుగా వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నట్లు సమాచారం రావడంతో వైద్య సిబ్బంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు సరఫరా చేశారు. అనంతరం తాగునీటి క్లోరినేషన్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాదిలింగ, పంచాయతీ కార్యదర్శి లోకేష్, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, భార్గవి, ఆశావర్కర్లు తదితరుల పాల్గొన్నారు. కాగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కోడలు అలైఖ్యరెడ్డి, ఎంపీపీ పద్మ, వైఎస్సార్‌సీపీ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ గాదిలింగ, ఎంపీటీసీ రాజేశ్వరి తదితరులు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు పెరగాలి

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ప్రైవేటుకు దీటుగా బడుల్లో మౌలిక వసతులను కల్పించింది. ఈక్రమంలో ఎక్కువ మంది పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని ఎంఈఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం కూడేరులోని ఎమ్మార్సీ సెంటర్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆది నుంచే ప్రణాళికాబద్ధంగా పదోతరగతి విద్యార్థులకు విద్యాబోధన చేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయా పాలన పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు బ్రేక్

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఈ నెల 18 నుంచి 20 వ తేదీ వరకూ తాగునీటి సరఫరా బంద్ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానంగా కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద నుంచి రాయదుర్గం పట్టణంలోని ఫిల్టరేషన్ పాయింట్ వరకూ తాగునీటిని సరఫరా చేసే గదుల్లో కొత్త మోటార్లు, పంపులను అమర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. అంతేకాక వీరాపురం, కణేకల్లు క్రాస్ వద్ద రెండు చోట్ల పైప్‌లైన్ లీకేజీలను మరమ్మతు చేస్తామన్నారు. 21వ తేదీ నీటి సరఫరా పునరుద్ధరిస్తామని, అప్పటి దాకా పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరాను చేస్తామన్నారు. ప్రజల సహకరించాలని ఆయన కోరారు.

'కాలవ' దోపిడీపై చార్జ్‌షీట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: టీడీపీ హయాంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసుల దోపిడీ ఓ రేంజ్ లో సాగిందని, ఆ మరకను కడుక్కునే క్రమంలో ఎదుటివారిపై బురద జల్లేలా వ్యవహరించడం సరైంది కాదని రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, డి హీరేహాళ్ మండల కన్వీనర్ ఎం. వన్నూర్‌స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ ఐదు మండలాల కన్వీనర్లు, నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో కలసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నాలుగేళ్ల పాలనపై కాలవ చార్జ్‌షీటు విడుదల చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవాలు..., అవాస్తవాలు 'కాలవ'కు తెలియకపోయినా.. ప్రజలకు బాగా గుర్తుంటాయన్నారు. నీకు దమ్ము, ధైర్యం ఉంటే.. నీ హయాంలో జరిగిన దోపిడీపై చార్జ్‌షీట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీరు-చెట్టు మొదలు ఇసుక, మట్టి ఆఖరకు మరుగుదొడ్లను సైతం వదలకుండా పర్సెంటేజీలు దండుకున్న నీచ బతుకు నీదికాదా..? అని నిలదీశారు. పేదల కడుపుకొట్టేలా జన్మభూమి కమిటీలు వ్యవహరిస్తే.. అక్రమ సంపాదనే ధ్యేయంగా నీవు రూ. వందల కోట్లు కొల్లగొట్టలేదా..? అని ప్రశ్నించారు. ఈ మాటలన్నీ మేమనడం లేదని, ఆనాడు నీ అవినీతి బాగోతంపై ఈనాడులోనే 'మంత్రి ఇలాకాలో కంత్రీల కులాస' అంటూ పెద్ద అక్షరాతో అచ్చేసిన ఘటన పై ఎండగట్టారు. ప్రభుత్వ విప్ కాపు ను లక్ష్యంగా చేసుకుని పసలేని ఆరోపణలు చేయడం మానుకుంటే మంచిదని, లేకపోతే అంతకు రెట్టింపుగా ఎదురుదాడి చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో టీడీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, కణేకల్లు పట్టణ కన్వీనర్ కేశవరెడ్డి, మండల కన్వీనర్ ఆలూరు చిక్కన్న, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్ డిష్ గోవిందు, వన్నూర్‌స్వామి, వార్డు ఇన్‌చార్జులు, ఇతర మండలాల నాయకులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

గుండె వైద్య శిబిరం

కూడేరు: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో అనంతపురానికి చెందిన కిమ్స్ సవీరా ఆస్పత్రి సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు తోపుదుర్తి వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. గుండె సమస్యలున్నవారు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

బొమ్మనహాళ్: మండలంలో ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో హుండీలో ఉన్న కానుకల లెక్కింపును శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో లెక్కింపు ఉంటుందన్నారు. ఆలయ మాజీ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు.

'నాడు-నేడు' పనులు పూర్తి చేయండి

కణేకల్లు: మన బడి 'నాడు-నేడు' పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటేష్‌బాబు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం 'నాడు-నేడు' పనులపై సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి ఎస్ఎస్ఏ జేఈ మంజునాథ, ఈఓఆర్‌డీ గూడెన్న, హెచ్ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఎంపీడీఓ, ఎంఈఓ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' పనులను నియమ నిబంధనల మేరకు నాణ్యతతో చేపట్టాలన్నారు. ఆర్‌ఓ ప్లాంట్ బిగించి పైప్‌లైన్ ఏర్పాటు పనులు పూర్తి చేయిస్తే టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా కనెక్షన్లు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మెడల్, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ, ఎంఈఓ

వజ్రకరూరు: చదువుతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచులు భూమా కమలమ్మ, కొర్రా శివాజీనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులు సాయి గోపాల్‌నాయక్(579), రాజేష్‌నాయక్(539) ఢాక్యా నాయక్ (505)ను శాలువా, పూలమాలలతో సన్మానించి మెడల్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ, ఎంఈఓ ఎర్రిస్వామి, ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, రంగనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పశు బీమాతో ప్రయోజనం

వజ్రకరూరు: వైఎస్సార్ పశు బీమా పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరు తుందని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు వెంకటేశ్వర్లునాయక్, రంగస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని కొనకొండ్ల గ్రామంలో వారు పర్యటించి రైతులకు వైఎస్సార్ పశుభీమా పథకం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమణాయాదవ్, పశువైద్యాధికారి క్రిష్ణమూర్తినాయక్, జేవీఓ భద్రనా య క్, ఏహెచ్‌ఓ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు బైపాస్ రోడ్‌లో ఉన్న బాలకృష్ణ అనే వ్యక్తికి చెందిన ఆవు శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. సుమారు రూ.90 వేల నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

బైకు అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: శెట్టూరు మండలం అడవి గొల్లపల్లికి చెందిన బోయ వీరన్న శుక్రవారం కర్ణాటకలోని పరుశురాంపురం నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తుండగా పెద్ద చెల్లాం వద్ద అదుపు తప్పి బోల్తా పడ్డాడు. ఘటనలో వీరన్నకు గాయాలయ్యాయి. బంధువులు అతడిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తోపుడు బండిని ఢీకొని..

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపాన శుక్రవారం రాత్రి అనంతపురం-బళ్లారి రహదారిపై జరిగిన ప్రమాదంలో కణేకల్లుకు చెందిన గంగాధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలిలా.. ఉరవకొండ నుంచి అనంతపురానికి తోపుడు బండిని తల్లీకొడుకు తోసుకువెళ్తున్నారు. అదే సమయంలో జల్లిపల్లి నుంచి గంగాధర్, సాయిచరణ్ (జల్లిపల్లి) ద్విచక్రవాహనంలో వెళుతూ తోపుడు బండిని ఢీకొట్టి కిందపడ్డారు. గంగాధర్‌కు తీవ్ర గాయాలు కాగా సాయికి స్వల్పగాయాలయ్యాయి. 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

సేవాభావంతో ముందుకు సాగాలి

కుందుర్పి: ముస్లింలు సామాజిక సేవాభావంతో ముందుకు సాగుతూ పేద కుటుంబాలకు అండగా నిలవాలని మత పెద్దలు ఖలీముల్లా, ఫారూక్, ఫీనాసాబ్ సూచించారు. శుక్రవారం అప్పిలేపల్లి జామీయా మసీదులో ముస్లిం ఆరాధన (మసూరా) కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ముస్లింలకు అనేక రకాల సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు ప్రతి గ్రామంలోనూ జామీయా మసీదు నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందన్నారు. సర్పంచ్ అతావుల్లా ముస్లింలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం

శెట్టూరు: మండలంలోని కనుకూరు గ్రామంలో సచివాలయ ఉద్యోగులు సమయానికి రాకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఉదయమే సచివాలయానికి వచ్చారు. ఆ సమయంలో సచివాలయ సిబ్బంది ఎవరూ సమయానికి రాకపోవడంతో ప్రజలు అధికారుల కోసం పడిగాపులు కాశారు. సచివాలయంలో మొత్తం 10 మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ వీఆర్వో నాగరాజు, హార్టికల్చర్ అసిస్టెంట్ కుమార్ స్వామి మాత్రమే విధులకు హాజరయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ అధికారులు విధులకు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

వరుస చోరీలు.. జనం బెంబేలు!



రాయదుర్గం: జేఆర్ఎస్ కాలనీలో తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేసిన ఇల్లు (ఫైల్)



కళ్యాణదుర్గం: మార్కెట్ యార్డులో పనిచేయని సీసీ కెమెరాలు

రాయదుర్గంటౌన్: పోలీస్ సర్కిల్ కేంద్రమైన రాయదుర్గం పట్టణంలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కేవలం నెలరోజుల వ్యవధిలోనే ఐదు భారీ స్థాయి చోరీలు జరిగాయి. ప్రధానంగా తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తూ బీరువాలను పగలగొట్టి విలువైన బంగారు ఆభరణాలు, నగదు దోపిడీకి పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలను అరికట్టడంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు ప్రజలకు సంతృప్తికరంగా లేకపోవడంతో ఇళ్లు విడిచి వెళ్లాలంటే జంకే పరిస్థితి ఉంది. రాయదుర్గం పట్టణం కర్ణాటక సరిహద్దుకు కేవలం 11 కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతో దొంగతనాల్లో ఆరితేరిన వారే అక్కడి నుంచి వచ్చేసి చాకచక్యంగా పనిముగించుకుని పరారవుతున్నట్లు తెలుస్తోంది. పెళ్లిళ్లు, శుభకార్యాలు, విహారయాత్రలకు వెళుతున్న వారి ఇళ్లనే దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇంటికి తాళాలు ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. దీంతో జనానికి కంటి మీద కునుకు కరవవుతోంది.

కూరగాయల మార్కెట్‌లో సెల్‌ఫోన్ దొంగలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో సెల్‌ఫోన్ దొంగలు అధికమయ్యారు. ప్రతి శుక్రవారం దొడగట్ట రోడ్డులోని మార్కెట్ యార్డులో జరిగే కూరగాయల సంతకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. ఇదే అదునుగా భావించిన సెల్‌ఫోన్ దొంగలు మార్కెట్‌ను టార్గెట్ చేశారు. ఇటీవల పట్టణంలోని ఫ్రెండ్స్ నెట్ సెంటర్ నిర్వాహకుడు శివ కుమార్‌కు చెందిన రూ.20 వేల సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడు వెంటనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చాట్‌బాట్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. ప్రతి వారం నాలుగైదు సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కూరగాయలు కొనే సమయంలో వినియోగదారులను ఏమార్చి సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. చోరీలు నియంత్రించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నా.. సెల్‌ఫోన్ దొంగల ఆగడాలు మానడం లేదు. కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల పని మరింత సులవవుతోంది.

పకడ్బందీ చర్యలు



చోరీలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. రాత్రి పూట గస్తీ ముమ్మురం చేశాం. సచివాలయ మహిళా పోలీసులు, వార్డు వలంటీర్లతో రోజూ సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నాం. చోరీలను అడ్డుకట్ట వేసేందుకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరం. ఇంటికి తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–లక్ష్మణ్, సీఐ, రాయదుర్గం అర్బన్ పీఎస్

కల్తీ విత్తనాలను అరికట్టాలి

వజ్రకరూరు: కల్తీ విత్తనాలను అరికట్టాలని ఏపీ రైతు స ఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి కోరారు. శుక్రవారం మండలంలోని చిన్నహోతురు, గడేహోతురు,వజ్రకరూరు తదితర గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఆయన మాట్లా డుతూ ఖరీఫ్, రబీ 2022 పంటల బీమాను వెంటనే ప్రకటించి రైతుల ఖాతాల్లోకి జమ చేయాలన్నారు.